క్లుప్తంగా

హస్తకళాకారులను ఆదరించాలి

చిత్తూరు రూరల్: హస్త కళాకారులను ఆదరించి.. ప్రోత్సాహించాలని నిర్వాహకులు నరేంద్రకుమార్, సునీల్ అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కట్టమంచిలోని వెంకుసా కల్యాణ మండపంలో చిత్తూరు హ్యాండీక్రాఫ్ట్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్, శ్రీకాళహస్తి వారి ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ హస్త శిల్ప వికాస్ యోజన ప్రాజెక్ట్ ద్వారా క్లస్టర్ కొయ్య బొమ్మలు, ఇతర క్లస్టర్ హస్తకళాకారుల హస్తకళ ప్రదర్శనను బుధవారం ప్రారంభిస్తున్నామన్నారు. 8 నుంచి ఈ నెల 17వ తేదీ వరకు ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. చిత్తూరు జిల్లాలోని కొయ్య బొమ్మలు, కడప జిల్లాలోని రాజా రాణి బొమ్మలు, కళంకారి తదితర వస్తువులను ప్రదర్శనలో ఉంచుతామన్నారు. అంతరించిపోతున్న హస్తకళలను ప్రోత్సాహించాలని వారు కోరారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : అబాకస్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. నగరంలోని కయని కట్టు వీధి, కొంగారెడ్డిపల్లె సాయినగర్ కాలనీల్లోని యూసీమాస్ అబాకస్ శిక్షణ కేంద్రంలోని విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 10 నిమిషాల్లో 200 లెక్కలు చేసి, విద్యార్థులు అక్షయ, యోగిరుద్ర తదితరులు ప్రతిభ చాటారు. వారిని ఆ సంస్థ డైరెక్టర్ భార్గవి ఉమా, శ్రీకాంత్, తల్లిదండ్రులు అభినందించారు.

గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడి నియామకం

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల జోనల్ అధ్యక్షులను నియమించినట్లు కేంద్ర పార్టీ కార్యాలయంలో వివరాలను ప్రకటించింది. ఈ మేరకు గ్రీవెన్స్‌సెల్ జోనల్(అనంతపురం, సత్యసాయి, అన్నమయ్య జిల్లాలు) ఇన్‌చార్జిగా రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్‌ను నియమించారు. ఈ మేరకు బీసీ సంఘాలు హర్షం తెలిపాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడిగా నియమించినందుకు జగనన్నకు, మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు కృతజ్ఞతలు తెలిపారు. రెండో సారి మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం కల్పించిన విషయం గుర్తు చేశారు. పార్టీ ఇచ్చిన బాధ్యతను నెరవేరస్తున్నరన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

యాదమరి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించనున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు పెరియంబాడి నాగరాజు తెలిపారు. చెన్నై ఎంఎస్ ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చెన్నై ఎంఎస్ ఆస్పత్రిలో నిర్వహిస్తామన్నారు.

ఎస్సీ ఎస్టీ కేసు విచారణ

ఐరాల: మండంలోని కామినాయనిపల్లె సర్పంచ్ బంగారమ్మను కులం పేరుతో దూషించడంపై నమోదైన కేసుకు సంబంధించి మంగళవారం చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి విచారణ జరిపారు. కామినాయనిపల్లె పంచాయతీ కార్యదర్శి సర్పంచ్ బంగారమ్మను కులంపేరుతో దూషించాడు. దీంతో బాధితురాలు ఐరాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ చేపట్టారు. డీఎస్పీతో పాటు ఎస్ఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత.. ఒకరి అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్ఈబీ అధికారులు

చిత్తూరు అర్బన్: బంగారుపాళెం మండలంలోని టేకుమంద గ్రామంలో మంగళవారం ఎస్ఈబీ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. ఈ దాడుల్లో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న గిరి (24) అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి 144 ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్ బాబు, సిబ్బంది కృష్ణయ్య, నాగరాజు, సుబ్రమణ్యం గౌడు, వేంకటేష్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

చిత్తూరుకార్పొరేషన్: నగరంలో మంగళవారం ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. పలు డివిజన్లలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనందపార్థసారథి సుడిగాలి పర్యటన చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డికి పట్టభద్రులు, ఉద్యోగులు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. మొదటి ప్రాధాన్యత ఓటును అయనకు వేయాలని కోరారు. అనంతరం కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ నగర సచివాలయ కన్వీనర్లు కిరణ్, రాంగణేష్, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


చిత్తూరుకార్పొరేషన్ గిరింపేటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకుందాం

చిత్తూరు రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థులను గెలుపించుకుందామని ప్రభుత్వ కాంట్రాక్ట్ జూనియర్ అధ్యాపకుల ఫెడరేషన్ సంఘం పిలుపునిచ్చింది. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ సంఘం సభ్యులు మాట్లాడారు. రాష్ట్ర ఫెడరేషన్ ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ అభ్యర్థులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలుపించుకుందామని చెప్పారు. ఒప్పంద అధ్యాపకులకు ప్రస్తుత ప్రభుత్వంలోనే మేలు జరిగిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా వేతనాలు అందించడంతో పాటు విధి నిర్వహణలో అధ్యాపకుల ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థులకు తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆ ఫెడరేషన్ అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, కార్యదర్శి అంబేడ్కర్, కన్వీనర్ ఉమాపతి, ఉపాధ్యక్షుడు కపిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ రెడ్డిని గెలిపించండి

యాదమరి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, యాదమరి ఎంపీపీ సురేష్‌బాబు కోరారు. మంగళవారం మోర్ధానపల్లె, వరదరాజుల పల్లె, కీనాటంపల్లె, 14 కండిగ ముస్లింవాడలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కబీర్, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చిత్తూరు రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు


యాదమరి: ప్రచారం చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, ఎంపీపీ సురేష్‌బాబు

పేర్నాటి మెజారిటీకి కృషి చేయండి

బంగారుపాళెం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజారిటీ అందరూ సమష్టిగా కృషి చేయాలని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి కోరారు. మంగళవారం వారు మండలంలోని కరిడివారిపల్లె నల్లంగాడు, కోటూరు, తుంబకుప్పం, పెరుమాళ్లపల్లె, ఈచనేరిపల్లె, తుంబపాళెం, శెట్టేరిలో పార్టీ నాయకులు ప్రచారం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, కో–ఆప్షన్ సభ్యుడు ఫిరోజ్ అహ్మద్, వైఎస్సార్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, యూత్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్ర, ఏఎంసీ మాజీ చైర్మన్ హేమచంద్రారెడ్డి, పార్టీ నాయకులు అరుణామల్‌రెడ్డి, పాలాక్షిరెడ్డి, మార్కొండ, ఎస్ఆర్ఐ భరత్‌రెడ్డి, హిదాయత్, నాగరాజ, సోషియల్ మీడియా ఇన్‌చార్జి రెడ్డెప్ప పాల్గొన్నారు.


బంగారుపాళెం: ఈచనేరిపల్లెలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ అమరావతి, పార్టీ నాయకులు

పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

చిత్తూరు అర్బన్ : నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం వద్దని నగర కమిషనర్ అరుణ ఆదేశించారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో పారిశుద్ధ్య నిర్వహణ, ట్రేడ్ లైసెన్స్ వసూళ్లు, క్లీన్ ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛ సర్వేక్షన్ తదితర అంశాలపై నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులు, వార్డు పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో పక్కాగా జరగాలన్నారు. ఉదయం 7.30 కల్లా ప్రధాన రహదారులను శుభ్రం చేయించే పనులు పూర్తి చేయించాలని ఆదేశించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేగా సేకరించి, అలానే డంపింగ్ యార్డ్‌కు తరలించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు, రెగ్యులర్ సిబ్బంది హాజరు నమోదు పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. నగర పరిధిలోని అన్ని దుకాణాలకు ట్రేడ్ లైసెన్సులు పూర్తిస్థాయిలో ఉండాలని, లేని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. క్లాప్ యూజర్ చార్జీల వసూళ్లు పెంచాలని ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2023కు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని, క్షేత్రస్థాయిలో గృహస్తులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్వో లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకానాథం, నరసింహ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

ఆర్యవైశ్య మహాసభ నగర అధ్యక్షుడిగా చల్లూరు

చిత్తూరు రూరల్: ఏపీ ఆర్యవైశ్య మహాసభ చిత్తూరు నగర శాఖ అధ్యక్షుడిగా సంతపేటకు చెందిన చల్లూరు ద్వారకనాథ్ నియమితులయ్యారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతాప్ చేతుల మీదుగా ద్వారకానాథ్ నియామక పత్రం అందుకున్నారు. ఈయనతోపాటు నగర కార్యదర్శిగా రవీంద్రబాబు, కోశాధికారిగా ప్రకాష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ద్వారకానాథ్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. సేవ కార్యక్రమాలు చేపట్టడంలో ముందుంటానన్నారు. త్వరలో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని అతిరథ మహారథుల సమక్షంలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. జిల్లా నాయకులు నరసింహులు, సత్యం, బద్రి, శివశంకర్, వేణుగోపాల్, మురళి, రామ్మూర్తి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

సంబరాల హోలీ

చిత్తూరు రూరల్: నగరంలో మంగళవారం హోలీ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ పండుగ ఉత్సాహంలో మునిగితేలారు. యువత రోడ్లపై రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.


హోలీ సంబరాల్లో యువత

ఘనంగా మహిళా దినోత్సవం


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న విశ్రాంత డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ హంసవర్ధిని

యాదమరి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం యాదమరి ఉన్నత పాఠశాల ఆవరణలో, యాదమరి ప్రభుత్వాస్పత్రిలో జిల్లా అధ్యక్షుడు శివయ్య అధ్యక్షతన అంతార్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. విశ్రాంత డిప్యూటీ డీఎం అండ్‌హెచ్ఓ హంసవర్ధిని హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అలాగే మహిళా శక్తి ముందు ఎవరూ నిలబడలేరన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విశేష ప్రతిభ కనభరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి హరిప్రసాద్ రెడ్డి, యాదమరి వైద్యులు సురేఖ, ఉన్నత పాఠశాల హెచ్ఎం గిరిరాజ తదితరులు పాల్గొన్నారు.

దిగువమాఘంలో..

తవణంపల్లె: మండలంలోని దిగువమాఘంలో మంగళవారం ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. దిగువమాఘంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి ఆధ్వర్యంలో మహిళలు మహిళా దినోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన మహిళలను అరుణకుమారి అభిమానిస్తూ శాలువలతో సత్కరించారు. అనంతరం మహిళలు మాజీ మంత్రి అరుణకుమారిని సత్కరించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆదర్శంగా నిలవాలని అరుణకుమారి ఆకాక్షించారు.


ఐరాల: మాట్లాడుతున్న ఈఓ కుసుమకుమారి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఐరాల: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఈఓ కుసుమకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని మల్లారపల్లెలో మహిళా సాధికార వారోత్సవాల్లో భాగంగా మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ మహిళా హక్కుల రక్షణకు రాజ్యాంగంతోపాటు, భారత ప్రభుత్వం అనేక చట్టాలు చేసిందని వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా స్వావలంబన సాధించాలన్నారు. జి.ఎర్రేపల్లె ప్రాథమిక పాఠశాలకు చెందిన సాహితి మహిళా దినోత్సవం గీతాన్ని ఆలపించి, అందరిని అలరించింది. సాహితికి శాలువ కప్పి ఈఓ కుసుమకుమారి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీసులు వాణి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి వ్యయం తగ్గించుకోవాలి


వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ మధుసూదన్ రెడ్డి, ఏఓ ప్రవీణ్

తవణంపల్లె: రైతులు పంట సాగులో పెట్టుబడిని తగ్గించుకోవాలని ఏడీఏ మధుసూదన్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని సరకల్లులో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. చిత్తూరు ఏడీఏ మధుసూదన్‌రెడ్డి ఆ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సరకల్లులో సాగులో ఉన్న పంటను వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడి, ఆదాయం వచ్చే పంటలను సాగు చేసి, పెట్టుబడి వ్యయం తగ్గించుకోవాలని సూచించారు. వరినాట్లు వేసేటప్పుడే కాలిబాటలు వదలాలన్నారు. దీంతో సుడిదోమను నివారించవచ్చని తెలిపారు. మిశ్రమ ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో తవణంపల్లె ఏఓ ప్రవీణ్, ఆర్బీకే సిబ్బంది కుసుమ పాల్గొన్నారు.

వనరులు కాపాడుకుందాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: ప్రకృతి వనరులను కాపాడుకుందామని ఎంపీడీఓ గౌరి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎస్‌జీఓలకు ఉమ్మడి వనరుల అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వేతర సంస్థలు కూడా ఉపాధి కల్పించవచ్చని తెలిపారు. అనంతరం యం.బండపల్లెలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరగా నిర్మాణాలు పూర్తిచేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సౌభాగ్యవతి, అధికారులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం


ఆలయంలో సత్యనారాయణ వ్రతం చేస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు


గరుడవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి అనుబంధ ఆలయం అయిన వరదరాజుల స్వామి ఆలయంలో అర్చకులు మంగళవారం శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఉదయం శ్రీదేవి, పెరుందేవి సమేత వరదరాజుల స్వామివారికి అభిషేకం, అలంకరణ, పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తిని సత్యనారాయణ స్వామి అవతారంలో అలంకరించి, ఆలయ ఆవరణలో కొలువు తీర్చి వ్రతం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, వ్రతం ఆచరించారు. సాయంత్రం స్వామివారిని గరుడ వాహనంలో కొలువు తీర్చి, పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు స్వామివారికి కర్పూర హరతులిచ్చి, మొక్కులు తీర్చుకున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

తవణంపల్లె: మండల కేంద్రంలోని జీసెస్ గాస్పెల్ చర్చిలో ఈ నెల 9వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పాస్టర్ ఏసు తెలిపారు. గురువారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు కంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించి, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామన్నారు. కంటి వైద్య శిబిరానికి చెన్నైకు చెందిన ఎంఎస్ కంటి ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో రోగులకు పరీక్షలు చేయిస్తామన్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. కేసు నమోదు

తవణంపల్లె: మండలంలోని ఎగువ తడకరలో ఇరువర్గాలు ఘర్షణ పడడంతో 11 మందిపై కేసు నమోదు చేసినట్లు తవణంపల్లె ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. దిగువ తడకర దళితవాడకు చెందిన సుధాకర్ ఎగువ వెంకటాపురం గ్రామానికి చెందిన సత్యనారాయణ పొలంలోకి వెళ్లగా ఇరువురు మధ్య ఘర్షణ జరిగింది. కులంపేరుతో దూషించాడని సుధాకర్ ఫిర్యాదు మేరకు సత్యనారాయణ మరో నలుగురిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అలాగే సత్యనారాయణ భార్య మాధవి సుధాకర్ తమ పొలంలోకి ప్రవేశించి తనపై అసభ్యంగా ప్రవర్తించి, చేయి పట్టుకున్నాడని ఫిర్యాదు చేయగా సుధాకర్ మరో ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇద్దరిపై నాన్‌బెయిల్‌బుల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎన్ఆర్‌జీఎస్ వివరాలివ్వండి

యాదమరి: ఉపాధిహామీ పథకంలో భారీగా అక్రమాలు జరిగాయని, ఆ వివరాలన్నీ ఇవ్వాలని శ్రీకాళహస్తికి చెందిన లాయర్ అంకయ్య సమాచారహక్కు చట్టం ద్వారా కోరారు. మండలంలో 2020–2023 సంవత్సరాల్లో చేసిన పనులకు మళ్లీ బిల్లులు పెట్టి రూ.కోట్లు దండుకున్నారని ఆరోపించారు. రెండు సంవత్సరాలలో రూ.17 కోట్లు పనులు చేసి ఉండగా ఆడిట్‌లో కేవలం రూ.10 వేలు మాత్రమే దుర్వినియోగం అయినట్లు చెప్పడం దారుణమన్నారు. దీనిపై వివరాలు కావాలని సమచార హక్కు చట్టంలో పేర్కొని ఉన్నారు. దీనిపై ఎంపీడీఓ శివరాజ్ ఉపాధిహామీ పథక ఏపీఓ కవితాను పిలిచి వివరాలన్నీ సమర్పించాలని కోరారు.

మంచి మార్కులు సాధించాలి

గుడిపాల: పదో తరగతి విద్యార్థులు జరగనున్న పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి, ఉన్నత శిఖరాలకు ఎదగాలని కమ్మతిమ్మాపల్లె, ఏఎల్‌పురం జెడ్పీ హైస్కూళ్ల హెచ్ఎంలు భానుప్రాద్‌రావు, కళావతి సూచించారు. మంగళవారం 197 రామాపురం, కమ్మతిమ్మాపల్లె, గొల్లపల్లె, ఏఎల్‌పురంలో పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లారు. విద్యార్థులు ఇళ్లలో చదువుతున్నారా? లేదా అని వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులు విద్యార్థులు ప్రతి రోజూ రెండుగంటల పాటు చదివేలా చూడాలన్నారు. పదో తరగతి పాసైనట్లయితే ఇక అన్నింట్లోనూ విజయాలు సాధించేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, మహేశ్వరి, యశోద, చిత్ర, సీఆర్పీ వాణి పాల్గొన్నారు.


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

వార్షిక క్రీడాపోటీలు ప్రారంభం


క్రీడాపోటీని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో వార్షిక క్రీడాపోటీలను ఎంపీడీఓ గౌరి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడాలలోను రాణించాలన్నారు. క్రీడల్లో బాలికలు, బాలురు తేడా లేకుండా అందరూ పాల్గొనాలన్నారు. రాబోయే కాలంలో మహిళా రిజర్వేషన్ ప్రకారం బాలురతో సమానంగా బాలికలు కూడా అన్ని క్రీడల్లో పాల్గొనేలా శ్రద్ధ చూపాలన్నారు. విజేతలకు పీసీ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాసులరెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దామోదరనాయుడు, మోహన్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


శేషాద్రిని సన్మానిస్తున్న ఆరోగ్యకేంద్ర సిబ్బంది

పూతలపట్టు: పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సూపర్‌వైజర్‌గా ఉద్యోగోన్నతి పొందిన శేషాద్రిని సహోద్యోగులు మంగళవారం సన్మానించారు. శేషాద్రి ఎంపీహెచ్‌ఈఓగా ఉద్యోగోన్నతిపై చెరుకూరివారిపల్లె పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ని సహోద్యోగులు సన్మానించారు. డాక్టర్ ప్రియంక తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యంపై కేసు నమోదు

ఐరాల: మండలంలోని మొరుంపల్లెకు చెందిన యువకుడు అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశామని ఐరాల ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మొరుంపల్లెకు చెందిన సిద్దేశ్వర కుమారుడు బోయకుమార్(22) గత నెల 22వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కొడుకు కోసం తల్లితండ్రులు సమీప బంధువులు, పరిసర గ్రామాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. దీనిపై తల్లి సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.